# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 02-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఈరోజు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.**
2. **ప్రతి నెలా ఒకటో తేదినే పింఛన్లు పంపిణీతో పేదల జీవితాలకు భరోసా కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కొత్తగా 4 కేంద్రీయ విద్యాలయాలను కేటాయించినట్లు కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.**

==========================

దసరా పండుగ సందర్భంగా తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కలబోతగా ఈ మహాయజ్ఞాన్ని కొనసాగించే నైతిక బలాన్ని అందించాలని దుర్గమ్మను కోరారు. ఈ దసరా ప్రతి ఇంటా వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

మరోవైపు, తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా ఈ పండుగను విజయదశమి పేరుతో జరుపుకుంటారని పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు దసరా ఉత్సవాలలో భాగంగా ఈరోజు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సాయంత్రం నిర్వహించాల్సిన అమ్మవారి తెప్పోత్సవం కృష్ణానదికి వరద ఉధృతి అధికంగా ఉండటంతో రద్దు చేసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

మరోవైపు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన ఈరోజు చక్రస్నానం, ధ్వజావరోహణం సేవలను నిర్వహించన్నట్లు అధికారులు వెల్లడించారు.

-------------------------

ప్రతి నెలా ఒకటో తేదినే పింఛన్లు పంపిణీతో పేదల జీవితాలకు భరోసా కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో నిన్న ఆయన పర్యటించారు. పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పి.అప్పలరాజుకు, ఆయన తల్లికి పింఛను అందజేశారు. అనంతరం ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ...

(వాయిస్...35 సెకన్లు)

---------------------------

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కొత్తగా 4 కేంద్రీయ విద్యాలయాలను కేటాయించినట్లు కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా ఈ 4 విద్యాలయాలు మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందించడంలో కీలకం కానున్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెనాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా బన్నువాడ గ్రామంలో మంత్రి నిన్న పర్యటించారు.. ఈ సందర్భంగా సూపర్ జీఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీని ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వస్తు సేవా పన్ను- జీఎస్టి తగ్గింపు వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

---------------------------

మహిళలు, బాలికల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం వైద్య శిబిరాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' వైద్యశిబిరాన్ని, 'పోషన్ అభియాన్' కార్యక్రమాన్ని నిన్న జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సేవలు, మందులను అందజేయాలని సూచించారు.

---------------------------

సత్యాగ్రహం, అహింసా అనే పదునైన ఆయుధాలతో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి... భారతదేశానికి స్వాతంత్ర్యం సముపార్జించి పెట్టిన మహనీయుడు మహాత్మాగాంధీ జయంతి ఈరోజు. ఈ సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. 1869వ సంవత్సరంలో గుజరాత్ రాష్ట్రంలోని పోరుబందర్ పట్టణంలో అక్టోబర్ 2వ తేదీన జన్మించిన మహాత్మాగాంధీ... ముందుండి శాంతియుతంగా భారత స్వాతంత్ర్య పోరాటాన్ని నడిపించి... యావత్ ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచారు. అందుకే... మహాత్మాగాంధీ జయంతి అక్టోబర్ 2ను ప్రపంచ దేశాలు అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా కూడా నిర్వహిస్తున్నాయి. భారతదేశం చేసిన విజ్ఞప్తి మేరకు ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ 2007 సంవత్సరంలో గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీని "అంతర్జాతీయ అహింసా దినోత్సవం" గా పాటించాలని ప్రకటించింది. అప్పటి నుండి ప్రపంచ దేశాలు గాంధీ జయంతిని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా పాటిస్తున్నాయి.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. జాతీయ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ఈరోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01:33)

---------------------------

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. 'సఫాయి మిత్ర సురక్ష సివిర్' కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలులో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిన్న ఆయన ప్రారంభించారు.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడిందని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలపింది. ఇది ఉత్తర, వాయువ్య దిశగా కదుతులూ తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఇది గోపాలపూర్ – పారాదీప్‌ల మధ్య తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో ఈ రోజు ఉత్తరాంధ్రలో కొన్ని చోట్ల భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

మరోవైపు ... తీరం వెంబడి 40 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

తెలంగాణలో ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================